12072024-DIS-04_Layout 1 7/12/2024 2:09 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# ఆమెకు ఆర్థిక సాధికారత

**ఎన్నిచెప్పినా..** మనదింకా, ఇంకా పురుషాధిక్య సమాజమే, ఇప్పటికీ. కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై పురుషులే పెత్తనం చెలాయిస్తారు. భార్యాభర్తలు ఇద్దరూ సంపాదనాపరులైనా మనీ పర్సు మగవాని చేతుల్లోనే ఉంటుంది. ఇక సంపాదన లేని గృహిణులైతే అస్వతంత్రులుగానే ఉండిపోవాల్సి వస్తుంది. కానీ, 'ఈ ఆర్థిక వివక్ష ఇంకానా, ఇకపై చెల్లద'ని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. బుధవారం నాటి తీర్పు ఏ రకంగా చూసినా చరిత్రాత్మకమైందేనని చెప్పాలి. నిజానికి తీర్పు వెలువరించింది ఓ ముస్లిం మహిళ మనోవర్తికి సంబంధించింది. కానీ, సర్వోన్నత న్యాయస్థానం డబ్బు వ్యవహారాల్లో భార్యాభర్తల సంబంధాల్లో సుదూర పరిణామాలకు దారితీసే వ్యాఖ్యలు చేసింది. 'మతమేదైనా విడాకులు పొందిన మహిళకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిందే' అనేది సుప్రీంకోర్టు మూల తీర్పు సారాంశం. విడాకులు పొందిన మహిళకు భరణం చెల్లించాలని సూచించే సీఆర్పీసీలోని 125వ సెక్షన్ మతాలతో ప్రమేయం లేకుండా అందరికీ వర్తిస్తుందని కోర్టు స్పష్టం చేసింది.

అయితే అంతటితో వదిలిపెట్టకుండా వివాహం లోపలా, వెలుపలా మహిళకు సంపూర్ణ ఆర్థిక హక్కులు కల్పించాలని చేసిన వ్యాఖ్యలు కీలకమైనవి. 'నేను మగవాణ్ని, పైగా సంపాదిస్తున్నాను, కనుక డబ్బుకు సంబంధించి నా మాటే చెల్లుబాటు కావాల'నే ఆలోచన మారాలని సుప్రీంకోర్టు హితవు చెప్పింది. కుటుంబ ఆర్థిక వ్యవహారాల్లో భార్యకు సమాన భాగస్వామ్యం ఉంటుంది. కుటుంబం కోసం, పిల్లల కోసం ఉద్యోగాలు మానేసి ఇంటికే పరిమితమయ్యే భార్య విషయంలో భర్త ఆలోచనా ధోరణి సమూలంగా మారాలి. ఆమె త్యాగాన్ని గుర్తించి ఆర్థిక సాధికారత కల్పించాల్సిన సమయం వచ్చింది. అందుకు ఉమ్మడి బ్యాంకు ఖాతా తెరవడం, ఏటీఎం పిన్ పంచుకోవడం వంటివి అవసరమని కోర్టు అభిప్రాయపడింది. మారిపోయిన ఆలోచనా ధోరణిని బట్టి ఈ తరహా మార్పులు ఈ సరికే చాలామంది అమలు చేస్తూ ఉండవచ్చు. సుప్రీంకోర్టు సూచనలు అలా అమలుచేయని వారి గురించే.

ఇక వివాహ బంధం విచ్ఛిన్నమైపోయి విడాకులు తీసుకున్నాక భరణం లేదా మనోవర్తి సమస్య వస్తుంది. ఇక్కడే మతాలవారీగా తలోదారి కనిపిస్తుంది. కానీ, సుప్రీంకోర్టు అలా కుదరదని చెప్పింది. భరణం అనేది ఏదో దానంగా ఇచ్చేది కాదనీ, అది స్త్రీల హక్కు అనీ సర్వోన్నత న్యాయస్థానం నొక్కిచెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా షాబానో కేసులో 1985 నాటి సుప్రీంకోర్టు తీర్పు, తదనంతరం 1986లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం తెచ్చిన ముస్లిం మహిళల మనోవర్తి చట్టం గురించి తప్పకుండా ప్రస్తావించుకోవాలి. మతంతో సంబంధం లేకుండా విడాకులు పొందిన మహిళలందరికీ 125 సెక్షన్ కింద భరణం హక్కు ఉంటుందని ఆనాడు సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దేశంలోని ప్రగతివాదులు ఆ తీర్పుపై హర్షామోదాలు వ్యక్తం చేశారు. కానీ, ఆ తీర్పును నీరుగారుస్తూ అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం చట్టం తేవడం వివాదాస్పదమైంది. ముస్లింల బుజ్జగింపు రాజకీయాల విషయం వస్తే ఈ చట్టాన్ని ఉటంకించడం సర్వసాధారణమైంది. నిన్నటి తీర్పుతో ఆ మార్పు వల్ల ఏర్పడిన వివక్షను సరిదిద్దినట్టయింది!

## దళితుల కన్నా ఓట్లపైనే మక్కువ

**ఎన్నికల గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం రూ.14,730 కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లిస్తున్నది. దళితులు, ఆదివాసీలపై కాంగ్రెస్‌కు ఏ మాత్రం మక్కువ లేదు. వారి ఓట్లపైనే కాంగ్రెస్‌కు మక్కువ.**

**- ప్రకాశ్ అంబేద్కర్**

# ఊరకరారు మహాత్ములు!




టంకశాల అశోక్

**ఊరకరారు మహాత్ములు. అందులోనూ చంద్రబాబు వంటి మహాత్ములు. అది కూడా హైదరాబాద్ వంటి సిరిసంపదల నగరానికి. పైగా తెలంగాణ ప్రజలు తన గత రికార్డును ఇంకా మరవనైనా మరవకముందే. తన పాలన యావత్తూ తెలంగాణ పట్ల ఎంత వివక్షతో, దోపిడీమయంగా సాగిందో ఒకవేళ విస్మరించినా, చివరి దశ వచ్చేసరికి ఎట్లా ఒకవైపు విభజనకు మద్దతుగా లేఖను ఇస్తూనే మరొకవైపు విభజన బిల్లు సమయంలో దానిని వ్యతిరేకించాలంటూ ప్రత్యేక విమానంలో పలు రాష్ర్టాలు తిరిగి మద్దతులు కూడగట్టిన ద్రోహాన్ని ఇంకా క్షమించకముందే. తెలుగువారి రాజకీయ చాణక్య చరిత్రలో చంద్రబాబు ఒక ప్రత్యేక వ్యక్తి. ఆయన ఒక మహాత్ముడు. తనకు ఒక విజన్-2020 వంటిది హైదరాబాద్ నగరంపై ఇప్పటికీ ఉన్నది. అది ఒక చెదరని కల. అటువంటి మహాత్ములు ఇక్కడకు ఊరకనే రారు.**

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అద్భుతమైన పోరాటపటిమను ప్రదర్శించి తిరిగి అధికారానికి వచ్చారు. గత ఐదేండ్లలో అక్కడ 'అంతా విధ్వంసమైం'దని ఎన్నికల ప్రచారానికి ముందే ప్రకటించారు. ఆ 'విధ్వంసం' ఎటువంటిదో అధికారానికి రాగానే శ్వేతపత్రాలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తమ ప్రజలకు వివరించారు. నిరంతరం కష్టించి దానినంతా చక్కదిద్దగలనని వారికి హామీ ఇచ్చారు. అంతా బాగున్నది. ఆయన ప్రమాణస్వీకారం చేసింది జూన్ 12న . కొత్త క్యాబినెట్ ఏర్పడి, శాఖలు కేటాయించి, మొదటి క్యాబినెట్ సమావేశం జరిగేసరికి మరొక 12 రోజులు గడిచి జూన్ 24 వచ్చింది. అధికారుల నియామకాలు ఇంకా పూర్తికాలేదు. శాఖల సమీక్షలు జరగలేదు. తాను అన్న విధ్వంసాన్ని ఎట్లా చక్కదిద్దాలో, అభివృద్ధి ఆలోచనలు ఏమిటో ఇంకా ప్రణాళికా రూపకల్పనలు చేయలేదు. ఇవన్నీ తక్కువ కార్యభారం కాదు.

అయినా వాటన్నింటి మధ్య చంద్రబాబుకు ఆ 24 నుంచి మరొక వారమైనా తిరగకుండా, జూలై నెల రానైనా రాకుండా, అకస్మాత్తుగా హైదరాబాద్ గుర్తుకువచ్చింది. దానితో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జూలై 1న లేఖ రాశారు. విభజన సమస్యలు పదేండ్లయినా పరిష్కారం కాలేదని, వాటిని పరిష్కరించుకొని రెండు రాష్ర్టాల అభివృద్ధికి, 'ఉమ్మడి లక్ష్యాల' సాధనకు కృషి చేద్దామన్నారు. అందుకోసం చర్చలకు సమావేశమవుదామంటూ కేవలం 4 రోజుల వ్యవధితో తానే ఒక తేదీని కూడా సూచిస్తూ లేఖ రాశారు. అది జూలై 6. చంద్రబాబు స్వయంగా అన్నట్లు అవి నిండు పదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు. అంత క్లిష్టమైనవి. ఆ పదేళ్లలో రెండు రాష్ర్టాలు ఉన్నతాధికారుల మధ్య, ఒక్కోసారి మంత్రుల ప్రమేయంతో, తరచూ కేంద్ర హోంశాఖ నిర్వహణలో చర్చలు అనేకసార్లు జరిగాయి. కానీ తేలిన అంశాలు కొద్ది మాత్రమే. అవి ఎప్పటికీ తేలనివని కాదు. అదే సమయంలో తేలిక కాదు. ఆ విషయమై చంద్రబాబు చొరవ తీసుకోవటం, రేవంత్‌రెడ్డి సమ్మతి, ఉభయుల చర్చలు యథాతథంగా ఆహ్వానించదగ్గవే. ఇదంతా స్థూలమైన దృష్టి. కానీ, ఇటువంటి దీర్ఘకాలికమైన, క్లిష్టమైన అంశాలకు సంబంధించి సూక్ష్మదృష్టి అనేది ఒకటుంటుంది. దాని ప్రకారం, ముఖ్యమంత్రులనే అత్యున్నత స్థాయిలో చర్చలకు ముందు, ఉన్నతాధికారులు చర్చించి విషయాలను కనీసం వీలైనంత మేర ఒక కొలిక్కి తేవాలి. ప్రస్తుత సందర్భంలో అటువంటిదేమీ జరగలేదు. చంద్రబాబుకు అప్పుడప్పుడే అధికారం, అప్పుడే మంత్రివర్గ నిర్మాణం వంటివి జరిగి, శాఖలపై సమీక్షలైనా చేయకుండా ఇంతలోనే లేఖ అంతలోనే చర్చలన్న తీరుతోనే అంతా అనుమానాస్పదంగా మారుతున్నది. ఎందుకింత ఆతురత అన్నది సందేహం.

చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడు, సూక్ష్మబుద్ధి, చాణక్యుడు గ్రహించలేని విషయాలు కావివి. తన చిరకాల మిత్రుడు, తన పట్ల ఇప్పటికీ ఎంతో ప్రశంసాభావం గల రేవంత్‌రెడ్డి, చర్చల ప్రతిపాదనకు సమ్మతించటంలో విశేషం లేదు. కానీ పైన చెప్పుకున్న వివిధ విషయాలన్నీ తెలిసిన చంద్రబాబు పరమోద్దేశాలు ఏమిటై ఉండవచ్చునన్నదే తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఆలోచించవలసిన, అర్థం చేసుకోవలసిన ప్రశ్న. అందుకు సమాధానం ఇరువురు సమావేశమైన జూలై 6న ఏమీ లభించలేదు. అది షరామామూలుగా జరిగింది. అయినప్పటికీ దానిని ఒక ఆరంభంగా తీసుకొని మునుముందు ఏవైనా రాజీలు జరిగితే తప్పక సంతోషించవలసిందే. అయితే, పైనంతా చర్చించుకున్నట్లు, చంద్రబాబు ఈ విధమైన, ఆకస్మికమైన, హడావుడి ప్రతిపాదనలోని పరమోద్దేశాలు ఏమై ఉండవచ్చునన్నది ప్రశ్న.



ఇందుకు సూచనప్రాయ సమాధానాలు మనకు రెండు దశలలో లభిస్తున్నాయి. ఒకటి, 6వ తేదీ సమావేశం కోసం 5వ తేదీ సాయంత్రం చంద్రబాబు హైదరాబాద్‌కు చేరుకున్నప్పుడు ఇక్కడ టీడీపీ వర్గాలు, ఇతర అభిమానులు చేసిన అసాధారణమైన హడావుడి. అంతకన్న ముఖ్యంగా 6వ తేదీ చర్చల తర్వాత 7వ తేదీన ఆయన ఎన్టీఆర్ భవన్‌లో చేసిన ప్రసంగం. వీటిలో మొదటిదానిని గమనిస్తే, మామూలుగానైతే ఇక్కడ చంద్రబాబు అభిమానులు తగినంతమంది ఉన్నారన్నది వాస్తవం. అట్లాగే, ఆయన తిరిగి అధికారానికి రావటం వారిలో ఉత్సాహాన్ని కలిగిస్తుందనేది కూడా అంతే వాస్తవం. అయితే, పైకి సాధారణంగా, అమాయకంగా కనిపించే అంశాలు ఒకోసారి నిర్వాహకుల రహస్యోద్దేశాలకు తెరవెనుక నుంచి ప్రేరకాలు, దోహదకారులు అవుతాయి. ఇది సామాజికంతో ముడిపడిన రాజకీయ సూత్రం. ఇక 7వ తేదీన జరిగింది అన్నింటికన్న ముఖ్యమైనది. చంద్రబాబు జూలై 1న అంత ఆకస్మికంగా లేఖ ఎందుకు రాశారన్న దాని నుంచి మొదలుకొని, ఇక్కడ తెలంగాణలో తన భవిష్యత్తు ప్రణాళికలకు సంబంధించిన ఆలోచనలు ఏమిటన్నంతవరకు అన్నింటికి క్లూలు అందులో కనిపిస్తాయి తన 7వ తేదీ నాటి ప్రసంగంలో.

చంద్రబాబు అసలు ఉద్దేశాలు అవి. కాకపోతే వాటిని పదేండ్ల విభజన సమస్యల పరిష్కారం, రెండు తెలుగు రాష్ర్టాల అభివృద్ధి అనే అందమైన మాటల ముసుగులో దాచిపెట్టారు. ఈ ముసుగు అనే ఎత్తుగడను ట్రోజన్ హార్స్ ఎత్తుగడతో పోల్చవచ్చు. ఇప్పుడు కథలు, చరిత్రలు చదవటం తగ్గింది గనుక ట్రోజన్ హార్స్ కథ ఏమిటో రెండు మాటలు చెప్పుకోవాలి. ఈ కథ గ్రీకు పురాణాల లోనిది. గ్రీకు రాజులు ట్రాయ్ నగరాన్ని జయించేందుకు పదేండ్ల పాటు విఫలయత్నం చేస్తారు. పదేండ్ల పాటు అనగానే చంద్రబాబు హైదరాబాద్ కోసం పదేండ్ల పాటు సాగించిన ప్రయత్నాలు కాకతాళీయంగా గుర్తుకువస్తే అది వేరే విషయం. అదట్లా ఉంచితే, గ్రీకు రాజులు చివరికి ఒక ఎత్తుగడ వేస్తారు. దాని ప్రకారం భారీ సైజులో ఒక కొయ్యగుర్రాన్ని తయారుచేసి, దానిలోపల మెరికల్లాంటి యోధుల్ని నింపి, ట్రాయ్ నగరపు గేట్ల వద్ద ఒక రాత్రి వదలుతారు. దానిని ఉదయం చూసిన ట్రాయ్ వాసులు ముచ్చట పడి కోటలోకి తోసుకుపోతారు. ఆ రాత్రి గ్రీకు సైనికులు ఆ గుర్రం పొట్టలోంచి బయటకు వచ్చి గేట్లు తెరవగా, గ్రీకు సైన్యం లోపల చొరబడి నగరాన్ని స్వాధీనం చేసుకుంటుంది.

ఇప్పుడు చంద్రబాబు విభజన సమస్యల పరిష్కారం, రెండు తెలుగు రాష్ర్టాల అభివృద్ధి అంటున్నది ఆ ట్రోజన్ హార్స్ వంటి ఎత్తుగడే. కాకపోతే రెండింటికి ఒక తేడా ఉన్నది. గ్రీకుల కొయ్యగుర్రంలో పారదర్శకత లేదు. చంద్రబాబుది పారదర్శక కొయ్యగుర్రం. తన ఉద్దేశాలు, ఎత్తుగడలు మనకు తేలికగా అర్థమవుతాయి. నిజానికి ఆయన ముఖ్యమంత్రిగా ఉండినపుడు తెలంగాణకు చేసిందేమిటో, తన రెండు కండ్ల సిద్ధాంతమేమిటో, విభజన సమయంలో సాగించిన కపట రాజకీయాలు ఏమిటో, వీటన్నింటికి ముందు ఎన్టీఆర్ విషయంలో చేసిందేమిటో, సమస్తం పాదర్శకంగానే ప్రజలకు తెలిసిపోయాయి. తను గాఢంగా నమ్మే ఆర్థిక సంస్కరణల ఫిలాసఫీ పారదర్శకత అవసరాన్ని నొక్కిచెప్తుంది. ఆ ఫిలాసఫీ ఆచరణ నిజంగా అంత పారదర్శకత కాదన్నది వేరే విషయం. కానీ, చంద్రబాబు రాజకీయ ఆచరణ మాత్రం చాలావరకు పారదర్శకమే. ఆ విధంగా ఆయన విభజన సమస్యల పరిష్కారం, రెండు తెలుగు రాష్ర్టాల అభివృద్ధి పేరిట ఒక ట్రోజన్ గుర్రాన్నయితే తెలంగాణపైకి వదిలారు గాని, ఆ ఎత్తుగడలోని పరమోద్దేశాన్ని 7వ తేదీనాటి ఎన్టీఆర్ భవన్ ప్రసంగంలో ఎంతో పారదర్శకంగా వెల్లడించారు.

చంద్రబాబు ప్రసంగ విశేషాలను తన అనుయాయులతో పాటు తెలంగాణ ప్రజలు అమితాసక్తితో చదివే ఉంటారు గనుక, ఇక్కడ మళ్లీ రాయనక్కరలేదేమో. ఆంధ్ర ధనిక వర్గాల వలస పాలనపై దశాబ్దాల పోరాటాన్ని చివరి పదిహేనేండ్లలో విజయవంతం చేసి, తర్వాత పదేండ్లలో ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా సుస్థిరం చేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో లేదు. తెలంగాణ స్వతంత్రతపై కాంగ్రెస్‌కు 1956 నుంచి కూడా శ్రద్ధ లేదు. వారి చరిత్ర యావత్తు అధికారం కోసం కాంట్రాక్టుల కోసం సీమాంధ్రులతో కుమ్మక్కు అయ్యి వారికి ఊడిగం చేస్తూ తెలంగాణకు ద్రోహం చేయటం, ఉద్యమాలను అణచివేయటమే. తమ కూటమి పక్షమైన బీజేపీ ఫెడరలిజానికి వ్యతిరేకి కాగా, ఆ పార్టీ ప్రధాని తెలంగాణ ఏర్పాటునే పలుమార్లు అవమానించినవాడు. ఇక చంద్రబాబు ఒక ఘన విజయం సాధించి ఊపు మీదున్నవాడు. తమకు తెలంగాణలో వివిధ సామాజిక, ఆర్థిక వర్గాల మద్దతు గలవాడు. కనుక తెలంగాణలో, మరీ ముఖ్యంగా సిరిసంపదల హైదరాబాద్ గడ్డపై తిరిగి కాలుమోపేందుకు ఇది తగిన అదను అని ఆయన నమ్ముతున్నట్టు తన ఎన్టీఆర్ భవన ప్రసంగం అరచేతి ఉసిరిక వలె తెలియజెప్తున్నది. వారికి హైదరాబాద్‌పై, తెలంగాణపై ఆశలు, కేసీఆర్‌పై కక్షలు ఇంకా చావలేదు.

తక్కినవి అట్లుంచి త్వరలో రానున్న అవకాశం స్థానిక సంస్థల ఎన్నికలు. అందుకోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి పనిచేస్తే ఆశ్చర్యపడనక్కరలేదు. అదిగాక అధికారం కోసం ఆశపడే తొత్తులు తెలంగాణలో ఇప్పటికీ కొందరు లేకపోలేదు. తాము ఇప్పటికిపుడు పై చేయి సాధిస్తారనే ఆశ చంద్రబాబుకు లేకపోవచ్చు. కానీ, ఆయన 7వ తేదీన స్వయంగా అన్నట్టు, తెలుగుదేశం పుట్టిన తెలంగాణ గడ్డ మీద ఆ పార్టీ పసుపు జెండా 'తిరిగి' రెపరెపలాడటం మొదలుపెడితే, ప్రస్తుతానికి అదే ఒక విజయం అవుతుంది. అందువల్ల, ఇన్నిన్ని పని వత్తిళ్ల అమరావతిలో ఉండినా, హైదరాబాద్‌కు ఊరకనే రారు ట్రోజన్ హార్స్ మహాత్ములు.

# తెలంగాణలో కొలువుల కొలిమి



ప్రజ్ఞ


ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం కొట్లాట, అపాయింట్‌మెంట్ ఆర్డర్ల కోసం కొట్లాట, పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు సమయం ఇవ్వాలంటూ కొట్లాట, పోస్టుల సంఖ్య పెంచాలంటూ కొట్లాట, పరీక్ష వాయిదా వేయాలంటూ కొట్లాట. రాష్ట్రంలో అసలేం జరుగుతోంది? ప్రగతిభవన్ వద్ద బద్ధలైన ముళ్లకంచెలు ఇప్పుడు టీజీపీఎస్సీ ఆఫీస్ ముందు ఎందుకు దర్శనమిస్తున్నాయి? పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన కాబోయే టీచర్లు విద్యా కమిషనర్ ఆఫీస్ వద్ద ఎందుకు ధర్నా చేస్తున్నారు? ఉద్యమాల గడ్డ ఉస్మానియా క్యాంపస్ చుట్టూ పోలీసులెందుకు మోహరిస్తున్నారు? ఎన్నికలప్పుడు కాంగ్రెస్‌కు స్నేహ హస్తం అందించిన నిరుద్యోగులు ఇప్పుడెందుకు రగిలిపోతున్నారు? నిత్యం ధర్నా చౌక్ ఎందుకు దద్దరిల్లుతోంది? నిరుద్యోగులకు న్యాయం చేస్తామని ప్రకటించిన నాటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్ నేడు అధికారంలోకి వచ్చాక సీఎం హోదా లో ఎందుకు స్వరం మార్చుకుంటున్నారు?

గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థుల నిరసనలపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమైనవి. నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాల్సిన ముఖ్యమంత్రే 'వాళ్లది కృత్రిమ ఉద్యమ'మంటూ వక్రీకరించడం బాధాకరం. స్వచ్ఛందంగా చేస్తున్న పోరాటానికి రాజకీయ రంగు పులమడం అసమంజసం. నిజంగనే ఎవరైనా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు అభ్యర్థులను రెచ్చగొట్టి ఉంటే వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవచ్చు కదా? ప్రభుత్వంలో ఉన్నది వాళ్లే కదా?

రాష్ట్రంలోని నిరుద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని గత నెల రోజులుగా దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాగా వారిని అరెస్టులు చేస్తూ పాశవికంగా వ్యవహరిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకుంటున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే జీవో నెంబర్ 55ని సవరించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అదేవిధంగా జీవో నెంబర్ 29 తీసుకురావడం వెనుక గల కారణాలను తేల్చాలి. గ్రూప్ 1 ప్రిలిమినరీలో జనరల్ ర్యాంకింగ్ ప్రకటించకుండా అత్యుత్సాహంతో ఫలితాలు ప్రకటించడం వెనకున్న ఆంతర్యం ఏమిటో అంతుచిక్కడం లేదు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే మెగా డీఎస్సీ వేయాలి. తాజాగా టెట్ ఫలితాలు రావడంతో అభ్యర్థుల సంఖ్య పెరిగింది. పరీక్షకు సన్నద్ధమయ్యే సమయం ఇవ్వాలి. టీఆర్టీని 45 రోజుల పాటు వాయిదా వేయాలి.

గ్రూప్ 1 తరహాలో గ్రూప్ 2లో కూడా పోస్టులను పెంచాలి. పరీక్ష తేదీలపై స్పష్టత ఇవ్వాలి. డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు ఒకే సమయంలో ఉండటంతో అభ్యర్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. గ్రూప్-2 వాయిదాపై మీడియాలో వస్తున్న వార్తలపై స్పష్టత ఇవ్వాలి. అంతేకాదు, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల సిలబస్ దాదాపుగా ఒక్కటే. కాబట్టి, ఈ రెండు పరీక్షలను తక్కువ వ్యవధిలో నిర్వహించాలి. యూపీఎస్సీ తరహాలో 2014 నుంచి టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలతో పాటు జవాబులను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి.

నిరుద్యోగుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా సామాజిక, ఆర్థిక, మానవీయ కోణంలో చూడాలి. పంతానికి పోకుండా ఓ మెట్టుదిగి నిరుద్యోగులతో చర్చలు జరపాలి. అప్పుడే నిరుద్యోగుల సమస్య పరిష్కారమవుతుంది.




# కేజ్రీపై మారని మోదీ తీరు



ప్రేమ్ శంకర్ ఝా

**2019 పార్లమెంట్ ఎన్నికల్లో 303 సీట్లు గెలుపొందిన బీజేపీ.. తాజా ఎన్నికల్లో 240కి పడిపోవడంతో 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అన్న ప్రధాని మోదీ శూన్య ప్రగల్భాలను కమలం పార్టీ మర్చిపోవాలని భావిస్తున్నది. తన నిరంకుశ లక్ష్యాలను పంచుకోనటువంటి రెండు ప్రాంతీయ పార్టీల మద్దతుపై బీజేపీ సర్కారు ఆధారపడి ఉంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా 22 ఏండ్ల తన రాజకీయ జీవితంలో మొదటిసారి ప్రధాని మోదీ శాసించే స్థితికి దూరమయ్యారు. గతంలో ఎన్నడూ లేని ప్రస్తుత పరిస్థితుల్లో తన నిరంకుశ పాలనా శైలిని సర్దుబాటు చేసుకోగలరా? అన్నది ప్రశ్న. ముఖ్యమంత్రిగా గానీ, ప్రధానిగా గానీ ఇదివరకు ఎన్నడూ చెప్పనిది, చేయనిది చేసేందుకు కూడా వెనుకాడరని ఈ స్థితి సూచిస్తున్నది. ఎందుకంటే, ఈ 22 ఏండ్లలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిన ప్రతీసారి ఆయన స్పందన ఆవేశపూరితంగానే ఉన్నది.**

గడిచిన 22 ఏండ్లలో తన లక్ష్యానికి అడ్డువచ్చిన ప్రతిఒక్కరిపై ఆయన కోపాన్ని ప్రదర్శించారు. 2001లో గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యాతో మొదలైన ఈ పరంపర కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, మానవ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్, గుజరాత్ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఆర్‌బీ శ్రీకుమార్ వరకు కొనసాగింది. ఈ క్రమంలో తన రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను మోదీ వినియోగించారు. ఇప్పుడు మోదీ అత్యంత దుర్మార్గంగా తన కోపాన్ని ఆప్‌పై, ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై ప్రదర్శిస్తున్నారు.

2014లో ఢిల్లీలోని ఏడు లోక్‌సభ సీట్లను గెలుచుకున్న బీజేపీ.. ఆ తర్వాత 2015లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన అనంతరం కేజ్రీవాల్‌పై మోదీకి ఆగ్రహం మొదలైంది. 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఢిల్లీలోని అన్ని ఎంపీ సీట్లను బీజేపీ గెలుచుకున్నప్పటికీ కేజ్రీవాల్‌పై ఉన్న కోపం మాత్రం తగ్గలేదు. 2015 నుంచి ఈ తొమ్మిదేండ్లలో ఢిల్లీ సర్కార్‌ను అప్రతిష్టపాలు చేసే, ఆప్‌ను దేశ రాజధానిలో అధికార పీఠానికి దూరం చేసే మోదీ ప్రయత్నాలు ఏ మాత్రం ఆగలేదు. 2021లో ఢిల్లీ ప్రభుత్వం మద్యం పాలసీలో మార్పులు చేయడంతో మోదీ తనకు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న అవకాశాన్ని పొందారు.

ఏటా ఢిల్లీ ఆదాయంలో 15-30 శాతం మద్యంపై విధిస్తున్న పన్నుల రూపంలో వస్తున్నది. అయితే దేశంలోని అత్యధిక పేద కుటుంబాలు మద్యం సేవించడాన్ని అసహ్యించుకుంటున్నాయి. ఢిల్లీలో 1970ల చివరి నుంచి మద్యం అమ్మకాలపై ప్రభుత్వ గుత్తాధిపత్యం నడుస్తున్నది. అంతేకాదు, మంత్రి, చట్టసభ సభ్యులు, ఆ శాఖ అధికారులకు అందే ముడుపులకు సంబంధించి ప్రధాన వనరులలో ఇది కూడా ఒకటి. అందువల్ల, ప్రభుత్వ గుత్తాధిపత్యానికి చరమగీతం పాడి, బహిరంగ వేలం ద్వారా మద్యం వ్యాపారాన్ని నిర్వహించాలని ఆప్ సర్కార్ నిర్ణయించుకున్నది. దీంతో ప్రజల దృష్టిలో ఆప్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు ఇదే మంచి సమయమని భావించిన మోదీ ప్రభుత్వం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నది.

2022 తొలి అర్ధ భాగంలో మోదీ తరఫున ఢిల్లీ ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ మొదటగా ఆయుధాన్ని ఎక్కుపెట్టారు. అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాకు నరేష్ కుమార్ లేఖ రాశారు. ఎక్సైజ్ మంత్రి సిసోడియా తీసుకున్న ఏకపక్ష నిర్ణయాల ఫలితంగా ఖజానాకు రూ.580 కోట్లకు పైగా నష్టం జరిగిందని ఆ లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా, లైసెన్స్ ఫీజులో తగ్గింపు, జరిమానాలపై మినహాయింపు ఇచ్చినందుకు గానూ మద్యం వ్యాపారులు, నిర్వాహకుల నుంచి ఢిల్లీ ప్రభుత్వం, ఆప్ నాయకులు ముడుపులు అందుకున్నారని అందులో పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని గోవా, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేయడానికి ఉపయోగించారని ఆయన ఆరోపించారు. ఆప్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాజ్యసభ ఎంపీ జైలు శిక్ష అనుభవించడానికి మోదీ ప్రభుత్వం సృష్టించిన ఈ లేఖే పునాది.

అభియోగాలు మోపబడిన వ్యక్తుల నియంత్రణలో ఉన్న ఇళ్లు, కార్యాలయాలను ఈడీ తన ఆధీనంలోకి తీసుకున్నది. సోదాల పేరిట వాటిని తలకిందులు చేసింది. అయినప్పటికీ ఆప్ నేతలకు వ్యతిరేకంగా ఒక్క చిన్న ఆధారాన్ని కూడా సంపాదించలేకపోయింది. సంజయ్ సింగ్ బెయిల్ విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఇదే విషయాన్ని ప్రస్తావించింది.

మామూలుగా అయితే ఏ దర్యాప్తు సంస్థ అయినా ఆప్ నేతలపై ఉన్న కేసును చాలా కాలం క్రితమే మూసివేసేది. కానీ, నేషనల్ హెరాల్డ్ కేసులో ఆధారాలను సమర్పించడంలో విఫలమైన నాటి ఈడీ డైరెక్టర్ తీవ్ర పరిణామాలను ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లేని కారణంగా సుబ్రమణ్యస్వామి వేసిన కేసును అప్పటి ఈడీ డైరెక్టర్ రాజన్ కటోచ్ మూసివేశారు. ఆ తర్వాత మోదీ అతన్ని పదవి నుంచి తొలగించారు.

అప్పటి నుంచి మోదీకి అనుగుణంగా పని చేయడంలో విఫలమైతే ఏం జరుగుతుందో ప్రతి ఈడీ అధిపతికి తెలుసు. దీని నుంచి ఇతరులు కూడా పాఠం నేర్చుకున్నారు. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు వెలువరించిన నిర్ణయాన్ని ఢిల్లీ హైకోర్టు తొందరపాటుతో కొట్టివేయడం దీనికి ఒక వివరణ. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు కాగానే ఈడీ ఢిల్లీ హైకోర్టుకు పరుగెత్తింది. మీడియాలో ఎత్తిచూపినట్టుగా రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును చదవకముందే, ఆ తీర్పు కాపీలను అందుకోకముందే, ఉద్దేశపూర్వకంగా న్యాయమూర్తి సుధీర్ కుమార్ జైన్ వారి వాదనను అంగీకరించారు. మద్యం వ్యాపారుల నుంచి అందుకున్నట్టు చెప్తున్న నగదుకు సంబంధించి మెటీరియల్ సాక్ష్యాలను సంపాదించడంలో విఫలమైన ఈడీ దక్షిణాది మధ్యవర్తులుగా పేర్కొంటున్న వ్యక్తులను ఆశ్రయించడంలో ఆశ్చర్యమేమీ లేదు.



కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తుందనే భయంతో అదే నేరం కింద అతన్ని అరెస్టు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు సీబీఐని తెరపైకి తీసుకొచ్చింది. చివరగా ఇద్దరు ప్రధాన ఇన్‌ఫార్మర్లు మాగుంట రాఘవ రెడ్డి, ఢిల్లీ వ్యాపారి దినేష్ అరోరా. సిసోడియాను అరెస్టు చేసిన సమయంలో అరోరా పోలీసుల అదుపులోనే ఉన్నాడు. తను చేసిన నేరాలకు గానూ క్షమాపణ పొందేలా హామీ తీసుకున్న తర్వాత అతను ఈడీ కోసం అప్రూవర్‌గా మారాడు. మాగుంట శ్రీనివాసులు, రాఘవ ఇద్దరిపై మొదట ఈడీ అభియోగాలు మోపింది. రాఘవరెడ్డి, దినేష్ అరోరాల వాదనలు ఎంత విశ్వసనీయంగా ఉన్నాయో ఈ కథనాన్ని చదివేవారు స్వయంగా నిర్ణయానికి రావచ్చు. 2023 అక్టోబరు 4న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో క్షమాపణ పొంది, అప్రూవర్‌గా మారిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇప్పుడు ఏపీకి చెందిన టీడీపీ ఎంపీగా ఉన్నారు.

కేజ్రీవాల్‌తో పాటు ఇతర ఆప్ నాయకులపై ఈడీ నమోదు చేసిన కేసు విచిత్ర లక్షణం ఏమిటంటే.. ఇంతకుముందు జరిగిన ప్రతి విచారణలోనూ ఏ కోర్టు అయినా సరే వారికి వ్యతిరేకంగా సాక్ష్యాలను సేకరిస్తున్నామనే కారణాన్ని చూపుతూ బెయిల్‌ను ఈడీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది. వారిని విడుదల చేయడం అసాధ్యం కాకపోయినా, ఈ పరిణామాన్ని చాలా కష్టతరంగా మారుస్తున్నది. అయితే ఈడీ చెప్తున్నదే నిజమైతే.. కొత్త మద్యం పాలసీ వల్ల ప్రభుత్వం కోల్పోయిన ఎక్సైజ్ ఆదాయం, మద్యం వ్యాపారుల నుంచి ఆప్ పొందిన ముడుపుల గురించి కచ్చితమైన వివరాలతో లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాకు ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ ఎలా లేఖ రాయగలిగారు? 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం గోవాకు తరలించిన డబ్బు ఎంత?

**ఆమోదయోగ్యమైన వివరణ**

దీనికి రెండు సమాధానాలు మాత్రమే ఉన్నాయి. నరేష్ కుమార్ లేఖలో ఉన్న విషయం మోదీ ప్రభుత్వం సృష్టించిన కట్టుకథ. లేదా అందులో ఉన్న సమాచారం సరిపోదని, అస్పష్టంగా ఉందని, ప్రత్యక్ష సాక్ష్యాధారాలతో దాన్ని బలపరచాల్సిన అవసరం ఉందని ఈడీ భావించి ఉండవచ్చు. వీటిలో మొదటిది చాలా ఆమోదయోగ్యమైన వివరణ.

కొత్త మద్యం పాలసీ వల్ల ఎక్సైజ్ డ్యూటీ ఆదాయానికి నష్టం వాటిల్లలేదు సరికదా ఆదాయం రెట్టింపు అయింది. గత విధానం ప్రకారం.. మద్యం విక్రయానికి సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం హోల్‌సేలర్, రిటైలర్‌గా ఉండేది. తయారీదారుకు వారి ఎక్స్ ఫ్యాక్టరీ ధరకు 5 శాతం చెల్లించి, మద్యంపై ప్రభుత్వం నియంత్రణను తీసుకుంది. రిటైల్ అవుట్‌లెట్లకు సరఫరా చేసే వరకు రవాణా, నిల్వ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించేది. రిటైల్ అవుట్‌లెట్లు కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉండేవి. ఈ బ్యూరోక్రాటిక్ గుత్తాధిపత్యం అనేక లోపాలను కలిగి ఉండేది.

కొత్త పాలసీ ద్వారా ఏడాదికి ప్రభుత్వానికి పన్నులు, లైసెన్ల రూపంలో రూ.10 వేల కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వస్తుందని.. తన పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ అధికారి హిందుస్థాన్ టైమ్స్‌తో చెప్పారు. ఇది గత మూడేండ్ల సగటు ఆదాయం రూ.5,500 కోట్ల కంటే దాదాపు రెట్టింపు.

చివరగా ఆప్ నేతలకు వ్యతిరేకంగా సాక్ష్యాలను సేకరించడానికి ఈడీ గడిపిన కాలంలో.. మీడియాలో ఎవరూ అన్నింటికంటే ముఖ్యమైన ప్రశ్నను అడగలేదు. హోల్‌సేలర్లు, రిటైలర్ల ఎంపిక రెండూ బహిరంగ వేలం ద్వారా జరిగినప్పుడు.. అసలు అక్కడ అవినీతి జరగడానికి ఆస్కారం ఎక్కడ ఉంది? ఆప్ నేతలను జైలులో పెట్టిన నాటి నుంచి ఈ ప్రశ్నను ఏ వార్తాపత్రిక గానీ, టీవీ వ్యాఖ్యాత గానీ అడగలేదు. భారతీయ మీడియాపై ఇదొక చెరగని మచ్చ.

('ది వైర్' సౌజన్యంతో)